# దేశంకోసం

= రచన: శ్రీ. ఆడపా చిదానంద శ్రీ. =

దుర్భేద్యములైన ఆ హిమాలయా శిఖరాల నడుమ పరవశంతో నిశాకన్య నాట్యం చేస్తోంది. ఎక్కడిదో తుహిన జల ప్రవాహపు గలగల సవ్వడి...నాట్యానికి నాంది పలుకుతోంది!


ఆ ఎగుడు దిగుడురాళ్ళ గుట్టల్లోనే వున్నాయి...ఓ రెండు వేల గుడారాలు. వాటి చుట్టూ మెతికల్లాంటి ఇద్దరేసివీరులు పహరా యిస్తున్నారు. నిటారయిన శిఖరాలు! మంచురేకులు కప్పిన బాటలు! అందులో...తన దేశం!...తన సోదరులు! తన కర్తవ్యం!...అనుకుంటూ ఆయాసాన్ని హాతమార్చి, ప్రత్యగ్రమోదాలతో ముందుకు సాగే ఆ వీరులు...పగల్లా అలా పాట్లుపడి, రాత్రి వెన్నుకు ఒత్తుకునే రాళ్ళను సహితం లెక్కచేయక-సుఖమెఱుగని నిద్రలో వున్నారు.

ప్రకృతి మాత ప్రశాంతంగా వున్నా హోరు గాలి మాత్రం వీస్తూనే వుంది. చలితో మిళితమై గడ గడలాడిస్తూనే వుంది!

రాజశేఖర్ తన రేడియం డైల్ వంక తధేకంగా చూస్తూ..."సరిగా పన్నెండయిందిరా రవీ! మన డ్యూటీ అయిపోయింది!" అన్నాడు కాస్త స్వరం తగ్గించి.

అతనికి అరడుగుల దూరంలో నుంచున్నాడు రవి! అతని కాళ్ళు త్వర త్వరగా కదిలాయి!

రవి ఏం చెప్తాడోనని...రాజ్ తల ఎత్తాడు. రవి అన్నాడు..."రాజ్! వాళ్ళది నిజమయిన నిద్ర కాదురా!-"హుష్" అంటే చాలు "లేచిపోయి-రైఫిల్స్ సర్దేసుకుంటారు పాపం! చూడు-మన ఛార్జి తీసుకోవలసిన "అమీర్ ఖాన్, రామ్‌సింగూ ఎట్లా గురకలు తీస్తున్నారో?-వారికి నిద్రాభంగం కలుగజేయవద్దు-ఏం?" ఆగాడు రవి! "రవి" తేజస్సును రవి ముఖంలోనే చూశాడు రాజశేఖర్!



"అందులోనూ నిశాకన్య నాట్యం చేసే ఈ భీకర కాళరాత్రిలో...నాట్యం చూడ్డంలో లీనమైంది గాబోలు నిద్రాదేవి! తన కర్తవ్యం మరచిపోయింది!" అంటూ రైఫిల్‌ని "కంధేసజ్"లో పెట్టాడు రాజ్!

నవ్వు అలవాటయిన రవి నవ్వబోయి వూరుకున్నాడు. అలా వూరుకోటానికి ఇంకో కారణం లేకపోతే లేదు! ఏదో ముఖ్య విషయం గుర్తుకు వచ్చింది!

"ఒరేయ్ రాజ్! మా రాధి అల్లికంపిన ఈ స్వెట్టర్సు వల్లనే మనం ఇంత ఎత్తయిన హిమాలయ గిరి కందరాలలో మంచురాళ్ళ మధ్య నుంచుని కాస్త ఓపిక పట్ట గలిగాం!" వూరుకున్నాడు రవి. "ఎగ్జాక్ట్లీ! రియల్!" ఆవిడ అల్లి పంపించిన స్వెట్టర్సు వేసుకున్న మన "మేజర్" అంతా అలానే అంటున్నారు. నిజంగా మంచి మనసు" "బ్రెరీ" ఓసారి తీసేసి, మళ్ళీ పెట్టుకోవడంలో లీనమయాడు రాజ్!

"ఓస్-మీశాంతి మాత్రం? ప్రతి మేజరు దగ్గరా వున్న ఆ ముదుర నీలిరంగు మఫ్లర్లు-గ్లౌజెస్-స్టాకింగ్సూ-వారానికోసారి-జామ్ బిస్కట్లు-ఆహా..," ఇంకా చెప్పబోతున్న రవినివారించాడు. రాజ్ మళ్ళీ రవే అన్నాడు-సీరియస్ ఫేస్ చూపిస్తూ.

"వురేయ్! నాలుగుగంటలప్పు డెక్కడికి పోయావ్? మీశాంతి దగ్గర్నుంచి పెద్ద పార్సిల్ బాక్సు వచ్చింది. చెప్పడమే మర్చిపోయాను!" కళ్ళు పెదవి చేశాడు రవి.

ఆశ్చర్య పోయాడు రాజ్! "అరె! మొన్న నే కదురా ఏవో పంపింది? మళ్ళీ ఈవాళ కూడానా? ఇంత త్వరగా ఎం చేత పంపిందంటావూ?"

అది విని అంత సీరియస్‌లోనూ తఫీమని నవ్వాడు రవి. ఆ నవ్వును చూసిన రాజ్ కి మండి పోయింది! అది గ్రహించిన రవి మాట మార్చాడు.

"కేంప్ కమాండెంటు దగ్గర పెట్టారు రేపు తీసుకుందాం!" ఆదుర్దాని చొప్పించాడు మాటల్లో "సరే చూద్దాం!" అన్నాడు రాజ్!

ప్రమాదం తప్పిందని ఎగిరి గంతువేయబోయి ఆగి పోయాడు రవి! వేస్తే ఏమౌద్దో తెలుసు మరి!!

తిరిగి రాజ్ అన్నాడు "రవీ! నేవెళ్ళి కాస్త టీ తయారుచేసుకు వస్తాను జాగ్రత్తగా వుండుమీ? పరవా లేదులే-మీ రాధి పంపిన "స్టా" వుందిగా! చప్పుడు లేకుండా టెంట్లో దూరాడు రాజ్!

"వెళ్ళు వెళ్ళు! మీ ఆవిడ దగ్గరే నేర్చుకున్నట్లున్నావ్ విద్య!-అయినా ఆ "రవి" ఉదయించినవరకూ ఈ చల్లబడిన రవికి వేడి లేదు!" నవ్వుతూ అన్నాడు రవి.

× × ×

రెండు రైఫిల్సూ భూమికి ఆన్చి ఆలోచనా సాగరంలో ఈదుతూ పరాకుగా కూర్చోబోయాడు. కాని మొనదేలిన ముంచురాయి అంచు, భాగం పంచుకుంది. క్షణికం "అబ్బ!" అనుకున్నాడు,

"ఆఁ! ఆ దినం పెళ్ళి పందిరలో తన ప్రక్క-'పీటె' పై కూర్చుంది రాధిక! మెర్క్యూరీ లైట్ల వెలుగు ఆమె ముఖాన పడి-బంగారు వర్ణపు ఛాయ మెరుస్తున్నట్లుగా వుంది-సన్న సన్నగా సన్నాయి-ఇంకో ఐదు నిముషాలలో తను రాధికకు పుస్తె కట్టబోతున్నాడు. మంత్రాలు చదివే "శాస్త్రిళ్ళు" గారు కాసేపు ఆగారు. ఎవరో ఓ గ్లాసుడు పాలు అందిచ్చారు వారికి!

అంతలో పోస్టల్ మెసంజర్ ఓ "రిజిస్టరుడు కవర్" తెచ్చి తనకు అందిచ్చాడు. సంతకం చేసి తీసుకున్నాడు తను! చించబోయి ఆగిపోయాడు. వర్షాకాలపు హోరు కన్నా జోరుగా (చెవులకు "బోర్"గా) మంగళ వాయిద్యాలు తమ పని చూసుకుంటున్నాయి మరి!

ఓ మూడు నిమిషాలు గడచినై! పెద్ద మనుషులూ-ముఖ్యంగా మధ్యవర్తులూ..."హమ్మయ్యా!" అని గట్టిగా నిట్టూర్చేసుకున్నారు.

ఆ రాత్రి ఆతృతగా కవరు చించాడు తను చూశాడు-ఒళ్లు గగుర్పొడిచింది! "గవర్నమెంట్ సీల్" వేయబడిన అరఠావు కాయితమది! తామర పూవు రేకల్లా విశాలములైన...ఏవో కనులు దీనంగా నిల్చున్నాయి. తన ముందు! హృదయానికి కిటికీలటగా...కళ్ళు!

గులాబీ రేకల్లా నును పైన ఆ చెక్కిళ్ళపై వర్షం కురుస్తున్నట్లని పించింది తన కానాడు! తను చందనపు బొమ్మలాంటి సతిని విడిచి వెళ్ళగలడా 'సీఫా' కి? అసలు పెళ్ళి చేసుకోకుండా వుండవలసింది! 'అగ్గిరాముళ్ళంతా' బెదరించి పెళ్ళి చేసేసారు. రాజ్ కి కూడా 'కాల్' వచ్చిందో లేదో—వచ్చే వుంటుంది... అనుకుంటూనంతలో నిజంగా వచ్చింది రాధిక!

'ఆదేవిటో చూడవచ్చాండి?' అంది పరిచయంగా, చిన్నప్పుడు... 'బావోయ్ — ఈ 'ప్రోబ్లమ్' అర్థం అవలా! కాస్త ఎక్స్‌ప్లెయిన్ చేదూ— ఊఁ!' అనే ఆ అల్లరి రాధి— ఇప్పుడు 'అండీ' అనగానే... తను — అర్థవ్యయంగా 'రండీ! చూడండి!' అన్నాడు. మీరే— మొండి ... జగమొండి! అంటున్న అర్ధాంగి చేతిలో ఆర్డరు కాయితం వుంచాడతను.

చదివింది! ముఖ కవళికా మారింది! తను గతుక్కుమన్నాడు. కాని అంతలోనే ఆమె ముఖాన 'సౌగంధి కాబందు రేక' యించుక లాస్యం చేసింది. ఆమె అంది మెల్లగా— 'మీరూ రాజశేఖరంగారూ కాలేజ్ లో 'అండర్ ఆఫీసర్' డ్రెస్‌లో... అనుకునే మాటలు నిజాలయాయి! మీ కలలకు జీవం వచ్చింది. తరుణమూ వచ్చి నిల్చుంది. 'భారత్' కి యివి అగ్ని పరీక్షా దినాలు! ఆ చీనా మూకల క్రూరాగ్ని శిఖలను శీతల వారుణాస్త్రంతోనే భేదించి, నిలువునా భేదించి— హిమధర శిఖరముపై భారతీయ పతాకఛళీ అనిపించుకోవాలి... ఆ బాధ్యత —'

'అవు రాధీ! అవు!! ఏనాడు దుండంగులు నా మాతృశయనాగార సమీపానికి రా సాహసించారో—అనాడే నాలో అవంధ్య ప్రతిజ్ఞ అంకురించింది. అగ్ని జ్వాలలు ప్రజ్వలించి శత్రు హృదయ జ్వలత్ కీలికలయాయి! ఈ చిన్ని అరఠావు లేఖలో నన్నూ పిల్చింది నా

ఝుండా! తక్షణం — ఆ పిలుపు నందుకోవాలి! నీలాంటి వీరనారీ ప్రోత్సాహం... నాలో అణువణువునా భారతీయ శౌర్యాన్ని... జాతీయ శక్తినీ — దేశ భక్తినీ రగిలించి — ద్విగుణీకృతమైన ఉత్సాహాన్ని కల్గిస్తోంది! కాని నీ ఎడబాటు నెలా సహించేది? ఏమైనాగాని వెళ్ళాలి రాధీ!' తను ఆగిపోయాడు.

రాత్రి గడచింది, ఎల్లా వచ్చిందో రాత్రి...అల్లానే వెళ్ళిపోయింది. బాలరవి ఉదయించాడు తూర్పున.

చుట్టాలతో పందిర హడా విడిగానే వుంది. రాత్రి 'ఫిట్' చేసిన మెర్క్యూరీలైట్లు యింకా 'రిమూవ్' చెయ్యనే లేదు! ఎక్కడి పనులక్కడే వున్నాయి! తన ప్రయాణం — రాధి ప్రోత్సాహం, చూసిన పెద్దలు దిగ్భ్రమ పొందారు. మధ్యవర్తుల సంగతి చెప్పనవసరం లేనేలేదు.

'రవీ! నీకు పిచ్చిగాని పట్టిందా ఏమిట్రా? మిలిట్రీ వుద్యోగాలు మనకొద్దు? పెళ్ళయి ఇరవైనాలుగ్గంటలన్నా అయాయట్రా?' అంది అమ్మ!

'వెధవ్వుద్యోగం! విత్ డ్రా చేసేయరా వెధవా! విన్నవారు నోటితో నవ్వరు తెలిసిందా?' అంటారు నాన్నగారు. సహజంగా తన కలవాటుగా వున్న 'చిఱునగవు' నే పెదవులపై వుంచాడు తను!

గబగబా సినిమాల్లో ''సూర్యాకాంతం''లా వచ్చింది అత్తయ్య! దుమారం రేగుతుం దనుకున్నాడతను.

''ఆ వెనకనే వచ్చింది రాధిక! నిండా వూపిరి పీల్చుకుని — యిచ్చింది కదా వుపన్యాసం...భలే వుపన్యాసం! ఎవ్వరూ కిక్కురు మనలేదు. అత్తయ్య మాత్రం వూరుకోలేక-''పరబ్రహ్మప్రభో! ఆడంగులకీ, చదువు ఎందుకు తెచ్చిపెట్టావురా బాబూ!'' అంది.

అడ్డుపెడితే దేశద్రోహం! ఊరుకుంటే సుపుత్రవియోగం! ఎటూ కాదనలేక వూరుకున్నారు. అంతలో ''రాజ్'' వచ్చాడు కిట్ బ్యాగ్ తో! ఆనంద్ చెప్పగా అంతా విన్నాడు.

అతగాడిని చూస్తూనే నోరెళ్ల బెట్టారు-అత్తయ్యా-అమ్మాను!-రాజ్ కి పెళ్లయి మూడు రోజులైంది మరి!

మీ వ్యాపారస్తులవద్ద

ఉషా

బనియన్లు

అని గుర్తున్న బనియన్లు

మాత్రమే కావాలని

పట్టుపట్టండి.

మరే ఇతర రకాలూ దీనికి

సరితూగక, మీకు

సంతృప్తినిచ్చేది

నేడు ఇది ఒకటి

మాత్రమే.

USHA KNITTING COMPANY TIRUPUR

* ఇప్పుడు ధారాళముగా దొరుకుచున్నది *

"ఏవిటోయ్! మీరంతా పెళ్ళిళ్ళు చేసుకొని పలాయనం చిత్తగిస్తే ఎట్లాగౌతుంది?" అన్నరు నాన్న! "ఏమిటండీ అలా అంటారు? మేమేం యుద్ధాలు చెయ్యాలా ఏమిటి? "ఆఫీసు వర్క్" ఇచ్చారు అభద్ధ మాడాడు రాజ్!"

కాసేపూరుకున్న తరువాత నాన్నారిలా అన్నారు.

"ఔన్లే! ఈప్సితార్థంబునకుఁ బారు హృదయరుచియు, నిమ్నమున కోడిగిలు నీరు నిలుపరాదు!" అని శ్రీనాథుడే అన్నాడు. మేమేం చేస్తాం!" అన్నారు నాన్నగారు చిన్నగా నవ్వుతూ! రాజ్ ఆడిన అభద్ధంతో అందరి మనసులూ తేలికపడినట్లున్నయ్!

× × ×

అది క్రొత్తగా వేసిన మిలిట్రీట్రైను! ఓ అరగంటలో బయలుదేరుతుందని మైక్‌లో చెప్పారు. రాధికను చూస్తూ వస్తూన్న దుఃఖాన్ని దిగమ్రింగుకున్నాడు తను! రాజా మాత్రం శాంతి ముఖంలోనికి చూస్తూ రెండు భాష్ప బిందువులు రాలాడు.

"ఏవండీ మహిళలకు లేని కన్నీళ్ళు మీకు రావచ్చా? మన పవిత్ర భాంధవ్య సంగీతానికీ-నవ నవోన్మేష జీవితానికి, మేల్బంతులయిన జీవన తంత్రుల్ని, క్రూరంగా ప్రకంపించి, ప్రళయం తెచ్చి పెట్టిన ఆ ద్రోహాదములను-సరిహద్దుల కవతలకు-మహిమాన్విత మానవత్వపు ప్రాంగణాలకు తరిమికొట్టడంలో సాయపడండి!" అంది శాంతి! శాంతి ఓ కవయిత్రీ మరి!

"ఓహ్ శాంతీ! ఇది కన్నీరు కాదు లేవే! ఇది పన్నీరు తెలుసా? ఆనంద భాష్పజలం!" అన్నాడు రాజు.

రాధికా...శాంతీ చేతులు ఊపుతున్నారు. ట్రైను కదిలింది. ఇంజన్...విజయభేరి మ్రోగించినట్లుగా ఘర్జించింది!

కర్చీఫ్ ఊపుతున్నాం...తనూ రాజా...కిటికీలో నుండి!—మళ్ళీ చూశాడు తను!! ప్లాట్‌ఫారం అంతటినీ "వాల్తేరు" అన్న పచ్చటి "డిజిగ్నేషన్ బోర్డు" మ్రింగేసింది నిరాసగా కూలబడ్డాం సీటులో!...

× × ×

రవి చెంప చురుక్కు మంది! బలే కోపంవచ్చి... చువ్వలా లేచి నిల్చున్నాడు. తీరా చూస్తే కారణంకు! వేరాక్ టీ చేసి— రెండు 'మగ్గు' లలో వేసి తెచ్చాడు. తెచ్చినా వాడూరుకోక— రవి చెంపకు అంటించాడు! పాపం రవి ఆలోచనల కంతరాయం!! 'ఏవిట్రా ఆ ఆలోచన? మనసంతా యింటిమీది కెళ్ళిందా?' టీ అందిస్తూ అన్నాడు రాజా! 'టీ' అందుకుంటూ ఊహూఁ! ఇంటి లోనికెళ్ళింది! 'మీదకు కాదు!' అన్నాడు, చెంప తడుముకుంటూ! రవి!!

రాజా యింకా ఏదో అనబోయాడు! రవి చేతిలోని మగ్గు క్రింద పడింది! ఆ అర్ధరాత్రి దూరంగా డేరాలలో కలకలం!— డేరాలలో వున్న సైనికులలో కోలాహలం 'తైయ్యార్ హోజావో జవానో!' కమాండర్ కేక! కేకలతో హడావుడి! అరపులతో అలజడి! 'పదండి ముందుకు! శత్రువులను రానివ్వకండి! దారివ్వకండి!' స్పష్టంగా వినపడుతున్నాయి కేకలు!

మిన్నూ మన్నూ తెలియని కటిక భయంకర అంధకార తిమిరాలు! వాటి మధ్య పర్వాలెత్తే వీరులు! గజగజ లాడించి గడగడ లాడించే శీతల వాయు తిమ్మెరలు! మంచు ముద్దల బాటల్లో కాళ్ళు దిగ్గబడిపోతున్నాయి!

సైనికుల రణోత్తుంగ నాదం మార్మ్రోగుతోంది! శత్రుఘ్నులు ప్రేలుతున్నాయి! సహస్రాఘ్నులు ఘోషిస్తున్నాయి మానవ హృదయాలు శతృవుల్ని ఘూషిస్తూన్నాయి!

ఆ రుధిర బింధు సంవోహనలోనికి వేలాది యువవీరులు లంఘిస్తున్నారు!

మిత్రద్రోహులు మృత్యు దంష్ట్రలో నలిగి చిత్తు చిత్తు అవుతున్నారు!

పారతంత్ర్యమంటే గిట్టని... కొదమ అశ్వపు గిట్టలు స్వైర విహారం సల్పుతున్నాయి!

ఎక్కడ పడితే అక్కడ బోర్లా క్రింద పడి షూట్ చేస్తున్నారు ఆ 'ట్రూపు' లోని వాళ్ళు!

రవి కుడికాలు గీసుకుంది! రాజశేఖర్‌కి చాల దెబ్బలు తగిలాయి!

హఠాత్తుగా నూరు గజాల దూరంలో... 'ధన్ ధన్' మన్న చప్పుడయింది...... అందరూ తమ శరీరాల్ని భూమికి ఆనించారు.

రాజా, నుదుటను అంటీ అంటనట్టు ఓ 'బుల్లెట్' దూసుకు పోయింది!

ట్రూప్ ముందుకు సాగింది!

చీకటిలో దొర్లుతూ రవి... రాజాతో సహా ఓ మంచు దిబ్బ వెనక్కు చేరాడు! ఫ్లాస్కులో వుంచిన కాస్త 'టీ' పోసి యిచ్చాడు. చిన్న ఆ ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తెరచి... కాస్త 'కాటన్' ని 'బెంజీన్' లో ముంచి అంటించాడు రవి! బాధగా మూలిగాడు రాజా!

'కాసేపిలా రెస్టు తీసుకోరా రాజ్! ఇప్పుడే వస్తాను.' అంటూ రవి వెనక్కు తిరిగాడు, రవి దొర్లుతూ సుమారు నూటా యాభై మీటర్ల దూరం వెళ్ళాడు...

అదొక మంచురాళ్ళ గుట్ట!

వాటి వెనుక నలుగురు వ్యక్తులు!

ఆ మాటు వేసి వున్న వారి మాటలు- తెలివి తక్కువగా- మేం 'శత్రువీరులమోయ్' అని చెప్తున్నట్లే అనిపించింది రవికి!

రవి ఉక్రోషం-ఉద్రిక్తత చెంది కసిగా మూడు నాలుగుసార్లు ట్రిగ్గర్ నొక్కింది! కాని విధి ఉద్దేశమేమిటో గాని ఆ రైఫిల్‌లో మూడే రౌండ్సు వున్నాయి!

ముగ్గురూ అరుస్తూ-"మానవులు మర్త్యులు!" అనిపించుకున్నాడు. నాలుగవవాడు తప్పించుకున్నాడు. రవి కళ్ళు అటూ యిటూ వెదికాయి! అంతలో వెనుక!- చిన్నదేదో సవ్వడి.

అతను వెనుదిరిగినంతలో- నాలుగు చేతు లతనిని రవిని భందించాయి! విదిలించాడు. పెనుగులాడాడు. మానవ ప్రయత్నమంతా చేశాడు. పాపం రవి ఒంటరిగాడు! ఏం చేయగలడు?

× × ×

అదొక నర్సింగ్ హోమ్! దానికి వేయబడిన తెలుపు



రంగు పెయింట్, విశ్వమానవ కళ్యాణ సూచకమగు కాంతిని తెలుపుతోంది! క్షతగాత్రులైన సైనికులను అందులో చేరుస్తున్నారు!

ఆశ్చర్యం! శాంతి...రాధికా...నర్స్ డ్రెస్సులో వున్నారు! ఎవరికో డ్రెస్సింగ్ చేస్తున్నారు. కాస్త రెష్టు వచ్చింది. కిటికీ దగ్గర చేరారు. పూల మొక్కలు స్వాగతం పలుకుతున్నాయి! కాస్తదూరంలో...తోటలో ఓ శిరీష పుష్పం గాలికి ఊగుతూ "టాటా" అంటున్నట్లుగా అగపడింది శాంతికి.

"శాంతీ! హైస్కూలు విడిచి-ఓ సంవత్సరం "నర్సింగ్" నేర్చుకున్నాక...మనం కాలేజీకి వెళ్ళాం కదూ? నిజంగా అదే యిప్పుడు పనికొచ్చింది!" అంది రాధిక! ఆమె ముఖంలో మళ్ళీ సౌగంధిక బంధు రేఖ తళుక్కుమంది!

"అది నిజమేగాని రాధీ! ఆ వేళ మనం వచ్చేసే ముందు. నువ్వు శేఖరంగారికి వ్రాసిన వుత్తరమూ... కలిపి ఆ పార్సిల్ బాక్సులోనే వుంచేశాను. అంది నయ్యో లేవో?! యూపిల్సూ-హార్లిక్స్ బాటిల్సూ వుంచానందులో! మనం యిలా యింటినుండి పారిపోయి వచ్చామనీ...'నర్సింగ్ హోమ్"లో ప్రవేశించామనీ- "డా॥ సాయిబాబా" గారింతో సహాయం చేశారనీన్నూ వ్రాశాను" రెప్పలు రెప రెప లాడించింది శాంతి!

"నర్స్!" చిన్నగా సన్నగా పిలుపు! నలుగురు భృత్యకాయులు-ఇద్దరు జవానులను తీసుకొచ్చి బెడ్ మీద పడేశారు!

ఇద్దరికీ బలమైన గాయాలే తగిలాయి! "శాంతీ! డాక్టరు గార్ని పిలువ్?! అంది రాధిక.

శాంతి వెళ్ళింది. అపరేషన్ థియేటరు నుండి డా॥ సాయిబాబా గారొచ్చారు తీవిగా నడుచుకుంటూ. "కాటన్ తీసుకరండి శాంతీ!" అన్నారు.

గాయాలు శుభ్రం చేశారు.

డ్రెస్సింగ్ చేసింది రాధిక.

అందులో ఒక జవాన్‌కి బలమైన గాయం...నడినెత్తి మీద తగిలింది.

సాయిబాబా ఎంతో ప్రయత్నించారు...కాసేపయాక, ఒక జవాన్‌కి స్పృహా వచ్చింది.

రెండవ జవాన్ తెలివి తప్పి వున్నాడు.

మిస్ట్రిస్ రాధికగారూ! పాపం యితనికి ఏదో బరువైన ఆయుధంతో నెత్తిమీద బలంగా ఎన్నోసార్లు మోదారు ఎవరో! అందువల్లే ఈయనకి "సెరిబ్రల్ ఇన్‌జ్యూరీ కూడా అయింది. ఇంకో రెండుగంటల్లో తెలివి రాక పోతే కష్టం!" అన్నారు జాలిగా! శాంతి, రాధికల ముఖాలు అయ్యో అంటూ విల విల లాడాయి.

అంతలో...భయంకరంగా ఓ సైరన్! లైట్లన్నీ ఆరిపోయాయి. ఎక్కడి నుండో రెండు బాంబర్ విమానాలు...ఆ ప్రదేశంలో బాంబ్ చేశాయి! అవి తిరిగి వెళ్ళిపోబోయేంతలో భారత వైమానిక దళం చేతిలో భస్మమయి ముక్క రాలినట్లు రాలి పోయాయి!

కాని నర్సింగ్ హోమ్ తుత్తునియలై పోయింది! అణువణువునా దగ్ధమైంది! అందులోని నిస్వార్థ జీవుల నంతంలో కలిసాయి! పైకి పోతున్న ఆ సన్నని పొగలో ఒక్కొక్క ధూమరేణువులో...ఒక్కొక్క జీవి... భారత మాతకు నీరాజన మిస్తున్నట్లే పైకెగసి పోతున్నారు!

జరపకూడని అపచారం జరిపారు దుండంగులు! కోపంతో నుఱగలు క్రక్కుతూ పంచపాండవుల్లా ఐదు హంటర్ విమానాలు "పెకింగ్" వైపు పరుగెత్తాయి!

× × ×

రాజశేఖర్‌ను మంచుదిబ్బ వెనుక వదిలి వెళ్ళిన 'రవి' యింకా తిరిగి రాలేదు. రాజ్‌కి ఆందోళనగా వుంది కాసేపు యిటూ అటూ చూశాడు. చిన్నగా...అడుగుల సవ్వడి!

తొంగి చూశాడు రాజ్! మూడు నల్లని ఆకారాలు! అతని రేడియం డైల్ "మూడున్నర" చూపిస్తోంది.

ఓ వ్యక్తిని యిద్దరు వ్యక్తులు లాక్కొస్తూన్నారు. నిశీధిలో పరికించి చూశాడు. "రవి!" అప్రయత్నంగా మనసులో అనుకున్నాడు. ఆమధ్యనున్న వ్యక్తి రవి! గుర్తించాడు!

అతని ఒళ్లు ఝల్లుమంది!

వేగంగా గుండె కొట్టుకుంటూంది! గురిచూసి ట్రిగ్గర్ నొక్కాడు. అయ్యో! బులెట్స్ లేవు! పెద్ద పెద్ద ధ్వనుల్లో ట్రిగ్గర్ నొక్కిన చప్పుడు కలిసి పోయింది.

**1965** మల్టీకలర్ ఫోటో హాఫ్ సెట్ మరియు కలర్ ట్రాన్స్‌ఫరెన్సీ

# పిక్చర్ కాలెండర్లకు

దయచేసి మమ్మల్ని సంప్రతించండి !!

టెలి: "కోరనేషన్" పి. బి. నెం. 2. ఫోన్ : నెం. 45.

# ది కోరనేషన్ లిథో వర్క్స్

(స్థాపితము: 1936)

శివకాశి [S. I.]

[ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే]

రాజ్‌కి..."ది బ్రిడ్జ్ ఆన్ ద రివర్ క్వాయ్!" జ్ఞాపకం వచ్చింది. తక్షణమని ఓ ఆలోచన వచ్చింది.

రెండు క్షణాలు యిటూ అటూ చూశాడు. వారి వెనుక పాటునే వెళ్ళి...రైఫిల్ తిరగవేసి "టో బట్"తో గట్టిగా మోదాడు.

బాధతో అరుస్తూ నేలకొరిగారా యిరువురూ!

తన నెవరు విడిపించారా అంటూ ఆతృతగా తిరిగి చూశాడు రవి!

అతని హృదయం కృతజ్ఞతామృతంతో నిండి పోయింది. కౌగిలించుకున్నాడు.

కాస్త దూరంలో ఏదో అలికిడి! ఎదురుగా చూశారు, అప్పుడే చీకటి తెరలు విడుతున్నాయి. నిశాకన్య నాట్యం చేసి చేసి...అలసి...విసిగి...వేసారి.. వెళ్ళిపోతోంది పశ్చిమాద్రివైపు.

వాళ్లు సుమారు పదిమంది వున్నట్లుగా చూశారు. వెంటనే "యూకలిప్టస్" పొద మాటులోనూ-మంచు దిబ్బల వెనుకనూ దాక్కొని...వాళ్ళ...తుపాకీ గుళ్ళ వర్షం నుండి తప్పించుకుంటున్నారు.

"రాజ్! మన ఆయుధాలు వారికి చిక్కకూడదు, మన శరీరాలూ అంతే గతి...ఊఁ..." అంటూ రవి...పెద్ద...పెద్ద మంచురాయిని పెకలించి బలంగా వాళ్ల పైకి విసిరాడు.

వాళ్ళింకా ఎంతో దూరంలో లేరు. రవి విసరిన రాయి ఆ గుంపులో పడింది. ఇద్దరి తుపాకులను ఎగురగొట్టి గాయపర్చింది. అంతలో ఒక్కుమ్మడిగా...ఎక్కడి నుండో పెద్ద పెద్ద మంచురాళ్లు వచ్చి పడుతున్నాయి. వాళ్ళ తుపాకీ గుళ్లు నిష్ప్రయోజనమైయాయి.

పెద్ద మంచురాయి వెనక్కు వచ్చారు. రాజ్, రవిలు. కళ్ళు బైర్లు క్రమ్ముతున్నాయి. అశక్తి ఆవరించింది. వెనక్కు తిరిగి చూశాడు రవి! కెవ్వుమన్నాడు! కారణం?...అది ఓ పెద్దలోయ! తాము హిమాలయా

లమైం.,ఓ చిట్ట చివరిభాగానికి వచ్చేశాము. యిక దారి లేదు అనే.

పాపం ఇద్దరు వీరులు ఎంతకన్న విసరగలరు ? వారు యంత్రాల్లా పనిచేశారు. నీరసం బాధిస్తోంది. హృదయం స్పంధనం అధికమైంది. శరీరం వణుకుతోంది.

"మరచిపోకు. వెరచి రాకు.
మనిషికి ఒకసారే మరణం,"

అంటోంది గౌరీ శంకర శిఖరాలయం! పద్నాలుగు వేల అడుగుల ఎత్తులో వున్న మహోన్నత శిఖరాగ్రం. "జైహింద్" అంటూ దూకేశారు లోయలోనికి!

భారత మాతను భంగించాలని చూసే ఆ ద్రోహులలో కొందరినైనా హత మార్చిన ఆ యిరువురినీ,. ఆ లోయ సంతోషంతో స్వీకరించింది. మరుక్షణం యథాప్రకారం ఏమీ తెలియనట్లే...స్నిగ్ధ గాంభీరంతో..,తుహీన జలప్రవాహపు సవ్వడిలో పరవశించింది ప్రకృతి కన్య.

అది హిమాలయ ప్రాంగణం. ఓ సమర సిభిరం శిభిరంలో చిన్న వెలుగు క్రొవ్వొత్తి వెలు. ఆ వెలుగులో ఓ పురుషమూర్తి. ఓ జవాన్, మహోద్రేకంతో రాసి రాసి ఆ పాడు. రెండు నిమషాలు కళ్లుమూసుకున్నాడు. ఓసారి చదివి మడిచి "కిట్ బాగ్"లో పెట్టేశాడు.

"ఉఫ్"న క్రొవ్వొత్తి కొండెక్కింది! గాఢంగా నిట్టూర్చి..."బ్లాంకెట్" మీద నడుం వాలాడు. జవాన్ సత్యన్నారాయణ!

ఆ రాత్రి కలలో...ఎవరో అగపడ్డారు, అతన్ని సాయుధబలం షూట్ చెయ్యబోయింది. "కలేజా వుంటే కాల్చురా!" అతను అరిచాడు. కలేజావుంటే?" అన్న ఆమాటలుకు గింగురుమన్నాయి. ఎవరెట్టు!.. భళ్లున తెల్లవారింది.

జననీ జన్మ భూమిశ్చ
స్వర్గాదపీ గరీయసీ!

[దేశంకోసం-స్వసుఖాలను త్యజించి, ధారాపుత్రులను విడనాడి, సమర రంగాన భీకర పోరాటంలో అసువులు బాసిన సోదరులకు బరువైన హృదయంతో -ఈ రచన అంకితం.]

# పండిత వాక్యం!

*

1. జీవితము అనంతమయిన అంటువ్యాధి అది పాటల్లో ప్రతిధ్వనించేవి తీరని బాధలు!
2. జీవితం ముండ్లలో ముకుళించుకొన్న గులాభీ మొగ్గలాంటిది!
3. మృత్యువు కారుమేఘంలో మెరుపుతీగె లాంటిది!
4. ఉత్సాహం విజయమునకు తల్లివంటిది!
5. ద్వేషించుట సులభం కాని ప్రేమించుట కష్టం!
6. వృత్తి యనునది కాలపు కొడవలి!
7. బీదరీక మనునది తన్నుతాను పరిచయం చేసుకుంటుంది.
8. సంగీత సాహిత్యాలలో అభిరుచిలేని వ్యక్తి తోక కొమ్ములులేని పసువుతో సమానం!
9. వీడు తనవాడని, వాడు పరుడని యెన్నిక మహాత్ములకు వుండదు. అందరూ సమానమే!

అడపా రామకృష్ణ-వైజాగ్.

కథాంజలి
[చక్కని కథల మాసపత్రిక]
స్థాపితము 1938.
విడి ప్రతి, — 25 న. పై.
సంవత్సర చందా, — రూ. 4-00
(ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గింబాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్సులులోనూ దొరుకును.